

జాడలేని చినుకు



వాడిపోతున్న మొక్కజొన్న

ఎల్లారెడ్డిపేటలో ఎదుగుదల లేని పత్తి మొక్కలు

ఇల్లంతకుంటలో మొలకెత్తని పత్తి

- దుక్కులు దున్ని దిక్కులు చూస్తున్న రైతులు
- చినుకు కోసం ఎదురుచూపులు
- మాడిపోతున్న పత్తి విత్తనాలు
- జిల్లాలో ఇప్పటి వరకు కురిసింది 58.5 మిల్లీమీటర్ల వర్షం
- వానాకాలంలోనూ 40 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు
- ఇప్పటి వరకు సాగు 36,360 ఎకరాలు
- పత్తి 20,410 ఎకరాల్లో విత్తనాలు
- 2625 ఎకరాల్లో నారుమడులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

నైరుతి వర్షాలు ముఖం చాటేశాయి. ఎండల తీవ్రతా తగ్గనంటుంది.. వానాకాలం సీజన్ ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్నా జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. తొలకరి జల్లులు పలకరించడంతో రైతులు దుక్కులు దున్నుకొని ఆరుతడి పంటలకు విత్తనాలు వేసు కున్నారు. మరోవైపు వర్షాలు కురుస్తాయని ఆశలతో పత్తి రైతులు వానాకాలం సీజన్ లక్ష్యంలో సగం వరకు విత్తనాలు వేసుకున్నారు. భూగర్భ జలాలు అందుబాటులో లేకపోవడంతోపాటు జిల్లాలోని శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు, అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీళ్లు అడుగంటడంతో వరి సాగువైపు రైతులు వెనకడుగు వేశారు. నారుమడులు సిద్ధం చేసుకొని వానల కోసం ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 2.42 లక్షల ఎకరాల్లో వానాకాలం సాగు

జిల్లాలో వానాకాలంలో 2 లక్షల 42 వేల 766 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని అధికారులు అంచనాలు వేశారు. వరి లక్షా 83 వేల 080 ఎకరాలు, మొక్కజొన్న 1510, పత్తి 49,215, కందులు 1502, పెసర 348, ఇతర పంటలు 599, ఉద్యాన పంటలు 6900 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు. ప్రస్తుతం జిల్లాలో 20,410 ఎకరాల్లో పత్తి విత్తనాలు వేసుకున్నారు. పెసర 15, కందులు 22, మొక్కజొన్న 243 ఎకరాలు వేసుకున్నారు. 2625 ఎకరాల్లో నారుమడులు సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో నారుమడుల్లో గంభీరావుపేటలో 110 ఎకరాలు, ఇల్లంతకుంట 230, ముస్తాబాద్ 280, సిరిసిల్ల 80, తంగళ్లపల్లి 250, వీర్నపల్లి 25, ఎల్లారెడ్డిపేట 210, బోయినపల్లి 40, చందుర్తి 50, కోనరావుపేట 500, రుద్రంగి 10, వేములవాడ 260, వేములవాడ రూరల్‌లో 580 ఎకరాల్లో నాట్ల కోసం నారుమడులు సిద్ధం చేశారు. నారుమడులు వర్షాలు లేకుంటే ముదిరిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొందరు రైతులువిత్తనాలు తెచ్చుకున్నామని వర్షా కోసం ఎదురుచూస్తున్నామని చెబుతున్నారు.

జిల్లాలో వానాకాలం సాగు పరిస్థితి (ఎకరాల్లో)

మండలం	సాగు అంచనా	ప్రస్తుత సాగు
గంభీరావుపేట	19535	1263
ఇల్లంతకుంట	39987	9757.5
ముస్తాబాద్	24239	1779
సిరిసిల్ల	5417	315
తంగళ్లపల్లి	22270	1032
వీర్నపల్లి	8095	572
ఎల్లారెడ్డిపేట	23093	2547
బోయినపల్లి	21150	4450.5
చందుర్తి	22016	4165
కోనరావుపేట	24295	4422
రుద్రంగి	10857	1845
వేములవాడ	7820	2465
వేములవాడ రూరల్	14340	1740
మొత్తం	242766	36360

మొలక దశలోనే పత్తి

జిల్లాలో వర్షాలు లేకపోవడంతో భూమిలో తేమ శాతం పూర్తిగా తగ్గిపోయి, పత్తి విత్తనాలు మొలకెత్తని పరిస్థితి ఏర్పడింది. 49,215 ఎకరాల్లో పత్తిసాగుకు సిద్ధమైన రైతులు 20,410 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు. ఇందులో ప్రధానంగా ఇల్లంతకుంటలో 8 వేల ఎకరాలు విత్తనాలు వేసుకోగా గంభీరావుపేట 10, ముస్తాబాద్ 30, సిరిసిల్ల 150, తంగళ్లపల్లి 200, వీర్నపల్లి 50, ఎల్లారెడ్డిపేట 600, బోయినపల్లి 28 00, చందుర్తి 2500, కోనరావుపేట 2000, రుద్రంగి 850, వేములవాడ 2200, వేములవాడ రూరల్‌లో 1020 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు. కొన్ని చోట్ల విత్తనాలు మొలకెత్తినా వర్షాలు లేకపోవడంతో ఎదుగుదల ఆగిపోయింది. భూమిలో వేడి తగ్గకపోవడంతో విత్తనాలు మాడిపోయి. మళ్లీ విత్తనాలు వేసుకునే పరిస్థితి వస్తుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

జూన్ 18 వరకు జిల్లాలో వర్షపాతం (మిల్లీమీటర్లలో)

మండలం	సాధారణం	కురిసింది	లోటు
రుద్రంగి	80.9	44.5	45.0
చందుర్తి	102.0	126.5	24.0 (ఎక్కువ)
వేములవాడ రూరల్	88.7	37.0	58.0
బోయినపల్లి	76.7	46.7	39.0
వేములవాడ	90.9	43.0	53.0
సిరిసిల్ల	86.2	46.0	47.0
కోనరావుపేట	78.0	45.6	42.0
వీర్నపల్లి	76.4	26.1	66.0
ఎల్లారెడ్డిపేట	76.0	99.7	31.0 (ఎక్కువ)
గంభీరావుపేట	72.6	40.6	44.0
ముస్తాబాద్	64.7	52.9	18.0
తంగళ్లపల్లి	90.8	108.4	19.0 (ఎక్కువ)
ఇల్లంతకుంట	58.8	42.9	27.0
సగటు వర్షపాతం	80.2	58.5	27.0

లోటు వర్షాపాతమే

నైరుతి రుతుపవనాలు తొలకరి జల్లులతో పలకరించినా వర్షాలు కురవకపోవడంతో జిల్లాలో 27 శాతం లోటు వర్షాపాతం నమోదైంది. గత సంవత్సరం 903.07 సాధారణ వర్షాపాతానికి 1149.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ సంవత్సరం జూన్ 1 నుంచి 18వ తేదీ వరకు జిల్లాలో 27.0 శాతం లోటు వర్షాపాతమే నమోదైంది. వీర్నపల్లిలో అధిక లోటు వర్షపాతం ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు 80.2 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 58.5 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. కురిసిన వర్షాపాతం కూడా రైతులకు ఉపయోగకరంగా లేకుండా పోయింది.

వానాకాలంలోనూ ఎండలు

వర్షాకాలం వచ్చినా ఎండలు మాత్రం తగ్గడం లేదు. జిల్లాలో ఇప్పటికి పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 39 నుంచి 40 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు సతమతం అవుతూనే ఉన్నారు. వర్షాలు ఎప్పుడు పడతాయని రైతులతోపాటు సామాన్య జనం కూడా ఎదురు చూస్తున్నారు.

వానలు లేకుంటే నష్టపోతాం



- గుర్రం సుధాకర్‌రెడ్డి, ముస్కానిపేట

వానల కోసం ఎదురు చూస్తున్నాం. ఐదెకరాల్లో పత్తివిత్తనాలు వేశాం. రెండు రోజుల్లో వర్షం రాకపోతే బాగా నష్టపోతాం. ఇప్పటికే పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాం.

పెరిగిన కూలీల ఖర్చు



- వజ్జపల్లి శ్రీనివాస్ కేశనపల్లి

గతంలో కంటే పెట్టుబడులు పెరిగాయి. 12 ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశాం. తొలకరి వర్షాలు చూసి విత్తనాలు వేసుకున్నాం. వానలు పడక పోవడంతో మళ్లీ విత్తనాలు వేసుకోవాల్సి వచ్చేలా ఉంది.

మొలకెత్తడం లేదు



- దాసరి సత్తయ్య, ఎల్లారెడ్డిపేట

మూడెకరాల సొంత భూమితోపాటు ఐదెకరాలు కౌలుకు తీసుకొని తొలకరి వర్షాలతో విత్తనాలు వేసుకున్నాను. రూ.35 వేలు దున్నడానికి, రూ.25 వేలు విత్తనాలకు పెట్టాను. వానలు లేక మొలకెత్తడం లేదు.

రేపాకలో ప్రాచీన శిల్పకళా సంపద



చౌడమ్మగుండుపై శిల్పకళా సంపద

ఇల్లంతకుంట, జూన్ 18: రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని రేపాక గ్రామంలోని చౌడమ్మ గుండుపై ప్రాచీన శిల్పకళా సంపద వెలుగులోకి వచ్చింది. కొత్త తెలంగాణ చరిత్రబృందం సభ్యులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లంతకుంట మండలం రేపాకలోని చౌడమ్మగుండుపై 10వ శతాబ్దానికి చెందిన అర్ధశిల్పాల దృశ్య కావ్యం చెక్కిఉంది. శిల్పంలో అశ్వారూఢుడైన ఒక వీరుడు అడివిపందిని బల్లెంతో పొడుస్తున్నట్లు కనిపిస్తుంది. అతడి వెనకాల రాజచత్రంతో మావటీడు ఏనుగుతో కనిపిస్తున్నాడు. దీనిని బట్టి పూర్వపు రాజులు మృగయావినోదం జరిపినట్లు గోచరిస్తుందని పేర్కొన్నారు. గతంలో నర్మెటలో లభించిన వీర గల్లులా ఇక్కడ కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ లభించిన శిల్పకళా సంపద వివరాలను కొత్తతెలంగాణ చరిత్రబృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ దృష్టికి తీసుకెళ్లినట్లు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చరిత్రబృందం సభ్యులు కెవిజికె ఆచార్య, వేములవాడ హరీష్, ఉదయ్‌కిరణ్, కూన సంతోష్, కూన శ్రీనివాస్, బిళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

కోనరావుపేట, జూన్ 18: అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలు, కళాశాలలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూజ్యం కార్తీక్ కోరారు. కోనరావుపేటలో ఏబీవీపీ కార్యకర్తల సమావేశం అనంతరం మంగళవారం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేటుకు దీటుగా ప్ర భుత్వ పాఠశాలల్లో బోధనకు కృషి చేయాలని అన్నారు.

పంచాయతీ ఇన్‌చార్జి ఈవోగా మల్లికార్జున్

ముస్తాబాద్, జూన్ 18 : ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి ఈవోగా బూస మల్లికార్జున్ యాదవ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఈవో రాజు సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి ఈవో బాధ్యతలను చేపట్టడానికి ఎవరూ ముందుకు రాలేదు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలతో ఆవునూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కొనసాగుతున్న మల్లికార్జున్ ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు స్వీకరించారు.

జూలైలో గ్రూప్-2 అభ్యర్థులకు గ్రాండ్ టెస్ట్‌లు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 18 : రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్ -2 రిక్రూట్ మెంట్ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రాండ్ టెస్ట్‌లను జూలైలో నిర్వహించనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్లవెంకటస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8, 9వ తేదీల్లో మొదటి గ్రాండ్ టెస్ట్, రెండో గ్రాండ్ టెస్ట్ 15, 16 తేదీల్లో, మూడో గ్రాండ్ టెస్ట్ 22, 23 తేదీల్లో, నాలుగో గ్రాండ్ టెస్ట్ 30, 31 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు వరకు, రెండో పేపర్ మధ్యాహ్నం 1.30 గంట నుంచి సాయంత్రం 4 వరకు ఉంటుందని తెలిపారు. ఈ టెస్ట్‌లకు హాజరు కావాలనుకునే ఆసక్తిగల అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను మావెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 19వ తేదీ నుంచి జూలై 5వ తేదీ వరకు సమర్పించాలన్నారు. పూర్తి వివరాల కోసం 9381888749, 0872 3223004 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన అధికారులు, ప్రజాప్రతినిధులు





ఆది శ్రీనివాస్‌ను కలిసిన కలెక్టర్, కలెక్టర్‌తో అధికారుల సంఘం ప్రతినిధులు

సిరిసిల్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందీప్‌కుమార్ ఝాను మంగళవారం జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు కలెక్టరేట్‌లోని స్టేట్ చాంబర్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సుదీర్ఘంగా జిల్లా పరిస్థితులపై చర్చించారు.

- విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసిన కలెక్టర్

కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అధికారుల సంఘం, టీఎన్‌జీవో, తెలంగా రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ సర్వీసెస్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. స్టేట్ చాంబర్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్‌తో టీఎన్‌జీవో ప్రతినిధులు

బద్ది పోచమ్మకు మొక్కులు



ఆలయం వద్ద భక్తుల సందడి

వేములవాడ టౌన్, జూన్ 18 : వేములవాడ దేవస్థానం అనుబంధంగా ఉన్న బద్దిపోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. మట్టి కుండలలో అమ్మవారికి నైవేద్యం వండి శివసత్తుల నృత్యాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు గంట పాటు నెత్తిన బోనాలతో క్యూలైన్‌లో బారులుదీరారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని తరించారు.

నులి పురుగుల నిర్మూలనకు కృషి చేయాలి

ఎల్లారెడ్డిపేట, జూన్ 18: నులి పురుగుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్‌చార్జి వైద్యురాలు స్రవంతి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్‌లో నులి పురుగుల నిర్మూలనపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వైద్యురాలు స్రవంతి మాట్లాడుతూ నులి పురుగుల నివారణపై ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. రక్త హీనతతో పిల్లలు బాధ పడతారన్నారు. రక్తహీనత నుంచి పిల్లలను కాపాడేందుకు ప్రభుత్వం నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తోందన్నారు. ఈ నెల 20న నిర్వహించనున్న అంతర్జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాత్రలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మండలంలో 16 వేల మంది పిల్లలు రక్తహీనతతో బాధ పడుతున్నట్లు గుర్తించామన్నారు. సమావేశంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మేరీ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: నులిపురుగుల నివారణకు కృషి చేయాలని మండల వైద్యాధికారి చిరంజీవి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బందితో మంగళవారంఅవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ నులి పురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్‌డీడీ ప్రాముఖ్యతను సిబ్బందికి వివరించారు. ఈ నెల 20న ఎన్‌డీడీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పిల్లల్లో వచ్చే రక్తహీనతను తొలగించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ పద్మ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రేణుక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి చిరంజీవి

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి అస్వస్థత

వేములవాడ టౌన్, జూన్ 18: బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అస్వస్థత గురవడంతో వైద్యుల సూచన మేరకు మంగళవారం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. గుండెకు సంబంధించి బాధపడుతున్నట్లు గుర్తించి వైద్యులు మెరుగైన సేవల నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రుల కిషన్ రెడ్డి, బండి సంజయ్, మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంతోష్ బాబు, రూరల్ ఎంపీపీ బండ మల్లేశం యాదవ్, కుమ్మరి శంకర్, గోపు బాలరాజు హైదరాబాద్‌కు వెళ్లి ప్రతాప రామకృష్ణను పరామర్శించారు.

బాధిత రైతుకు పరామర్శ

కోనరావుపేట, జూన్ 18: కోనరావుపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన మంత్రి శంకర్ రెండు రోజుల క్రితం పొలం వద్ద పాముకాటు గురయ్యాడు. కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మంగళవారం బీఆర్‌ఎస్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మంతెన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సమీకృత మార్కెట్ నిర్మాణమెప్పుడో?

- కూరగాయల మార్కెట్ లేక అవస్థలు
- రోడ్డుపై విక్రయాలు
- వ్యాపారులు, రైతుల ఇబ్బందులు



గంభీరావుపేటలో రోడ్డుపై నిర్వహిస్తున్న కూర గాయల మార్కెట్

గంభీరావుపేట, జూన్ 18: గంభీరావుపేట మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ లేక వ్యాపారులు, రైతులు, కొనుగోలు దారులు అవస్థలు పడుతున్నారు. ఎండలో ఎండుతూ వానలో తడుస్తూ రైతులు, వ్యాపారులు, క్రయవిక్రయాలు చేస్తున్నారు. గత పాలకులు సమీకృత మార్కెట్‌ను నిర్మించాలనే ఉద్దేశంతో ఉన్న పాత కూరగాయల మార్కెట్‌తోపాటు పాత గ్రామ పంచాయతీ భవనాన్ని కూల్చేశారు. దీంతో అటు నూతన మార్కెట్ నిర్మా ణం మొదలుకాక ఇటు ఉన్న కూర గాయల మార్కెట్‌ను కూల్చేయడంతో రోడ్డుపైన కూర గాయల మార్కెట్ కొనసాగుతోంది. దాదాపు ఏడాది కాలంగా కూర గాయల మార్కెట్ రోడ్డుపైన్నే కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రతీ రోజు మండల పరిధిలోని గ్రామాలతోపాటు సిద్దిపేట జిల్లా పరిధిలోని పలు గ్రామాల నుంచి 200 మందికిపైగా రైతులు కూరగాయలు అమ్మేందుకు వస్తుంటారు. కూర గాయల మార్కెట్‌లో కనీస వసతులు లేకున్నా తై బజార్ కింద అధికారులు డబ్బులు మాత్రం వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు పట్టించుకోవాలని, సమీకృత మార్కెట్‌ను నిర్మాణానికి కృషి చేయాలని స్థానికులు కోరారు.


గోస పడుతున్నాం

- అంజయ్య, కూరగాయల వ్యాపారి



కూరగాయల మార్కెట్ లేక ఏడాది కాలంగా గోస పడుతున్నాం. కొత్త మార్కెట్ కడుతామని ఉన్న పాత మార్కెట్‌ను కూల్చేశారు. ఇప్పుడు కొత్తది లేదు. పాతదీ లేదు. దీంతో ఎండలో ఎండుతున్నాం. వానలో తడుస్తున్నాం. ఎన్నికలప్పుడు ఓటేయాలని నాయకులు వస్తుంటారు. ఇప్పుడు పట్టించుకోవడం లేదు.







రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


వినోద్ కుమార్ (ఫైల్)

ఓదెల, జూన్ 18: భార్య బంధువుల వేధింపులతో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఓదెల మండలం కొలనూరులో వెలుగు చూసింది. మండలంలోని కొలనూర్ రైల్వే గేట్ సమీపంలో సోమవారం రాత్రి ఇదే గ్రామానికి చెందిన దున్నపోతుల వినోద్ కుమార్ (32) అనే యువకుడు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి స్వరూప రామగుండం జీఆర్‌పి హెడ్ కానిస్టేబుల్‌కు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వినోద్ కుమార్ భార్య వసంత బంధువులైన అమ్మమ్మ మాడక ఎంకమ్మ, నానమ్మ బొంతల కనకమ్మలు మానసికంగా వేధించడం వల్లనే నా కొడుకు ఆత్మహత్యకు పాల్ప డ్డాడని పేర్కొన్నారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, విచారణకు సహకరించకుంటే పొత్క పల్లి పోలీస్‌స్టేషన్‌కు కేసును అప్పగించ నున్నట్లు రామగుండం జి.ఆర్.పి. హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. కరీంనగర్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దున్నపోతుల రాజయ్యకు ఏకైక కుమారుడైన వినోద్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంతో పాటు, కుటుంబంలో విషాదం నెలకొంది.

వృద్ధురాలి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, జూన్ 18: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు ఎనగందుల భూదవ్వ అదృశ్యంపై కేసు నమోదు చేశామని పోలీసులు మంగళవారం తెలిపారు. గ్రామంలోని వృద్ధురాలు భూదవ్వ ఈ నెల 17న మధ్యాహ్నం ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళుతానని చెప్పి బయటకు పోయింది. అదే రోజు రాత్రి కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి ఫోన్ చేసి విషయం తెలుసుకున్నారు. తమ వద్దకు రాలేదని స్పష్టం చేయడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువుల వద్ద, చుట్టు పక్కల ఆరా తీశారు. ఆచూకీ లభించ లేదు. దాంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

జమ్మికుంట రూరల్, జూన్ 18: జమ్మికుంట మండలం తనుగుల గ్రామ శివారులో మంగళవారం విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. మూల ప్రభాకర్, పైడిపల్లి సంపత్‌లకు చెందిన రెండు గేదెలు తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలి అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాయి.
















మహిళకు పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బందికి మంత్రి పొన్నం అభినందన



ఆర్టీసీ సిబ్బందిని అభినందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భగత్‌నగర్, జూన్ 18: కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ఆదివారం గర్భిణికి పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బందిని మంగళవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన గర్భిణి కుమారి తన భర్త జాలతో కలిసి ఆదివారం కుంట (భద్రాచలం) వెళ్లేందుకు ఆదివారం కరీంనగర్ బస్‌స్టేషన్‌కు వచ్చింది. కొద్దిసేపటికే కుమారికి పురిటి నొప్పులు రావడంతో ఆర్టీసీ సిబ్బంది సాయం కోరగా వెంటనే 108 సిబ్బందికి ఫోన్ చేశారు. పురిటి నొప్పులు ఎక్కువ కావటంతో ఆర్టీసీ మహిళా సిబ్బంది ప్లాట్‌ఫాం ఎదురుగా ఉన్న చెట్టు కిందకు కుమారిని తీసుకు వెళ్లి చుట్టూ చీరలు కట్టి డెలివరీ చేశారు. పండంటి ఆడబిడ్డకు జన్మనివ్వగా 108 సిబ్బంది తల్లీబిడ్డను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు.

●పురిటి నొప్పులతో ఉన్న మహిళకు డెలివరీ చేసిన ఆర్టీసీ సిబ్బందిని మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు. మహిళకు పురుడు పోసిన ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సైదమ్మ, రేణుక, భవాని, లావణ్య, స్టేషన్ మేనేజర్ అంజయ్యలను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌లు 5వేల నగదు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్‌కుమార్, రీజినల్ మేనేజర్ సుచరిత, డిప్యూటి రీజినల్ మేనేజర్లు భూపతిరెడ్డి, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మారుతీ.. వసతి ఏదీ..

- వేలాదిగా భక్తులు.. పదుల సంఖ్యలో అద్దె గదులు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు
- కొండగట్టులో వెక్కిరిస్తున్న అసౌకర్యాలు

మల్యాల, జూన్ 18: ఉత్తర తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానంలో సౌకర్యాల లేమి భక్తులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. భక్తులు, దుకాణాల ద్వారా దేవాస్థానానికి ఏటా సుమారు రూ.20కోట్ల వరకు ఆదాయం సమకూరుతున్నప్పటికీ కొండపైన కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ప్రభుత్వం, దేవాదాయ శాఖ అధికారులు, దేవస్థానం అభివృద్ధికి చర్యలు తీసుకోకపోవడంతో భక్తులకు ఇబ్బందిగా మారింది. కొండపై ముఖ్యంగా వసతి సౌకర్యం లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కొండగట్టుకు నిత్యం వేలాదిగా, శని, ఆది, మంగళవారాల్లో వేలాదిగా భక్తులు తరలివస్తూంటారు. అయితే కొండపై గదులు లేమి ఇబ్బంది మారింది.

● వేలల్లో భక్తులు.. పదుల్లో గదులు

కొండగట్టు అంజన్న దర్శనానికి నిత్యం వేలాదిగా భక్తులు వస్తున్నారు. ఇక ప్రతి మంగళ, శని, ఆదివారాల్లో దాదాపుగా ముప్పై వేల వరకు తరలివచ్చి స్వామి వారికి మొక్కులు తీర్చుకుంటారు. ఇందుకుగాను ముందు రోజే వేలాదిగా భక్తులు చేరుకుంటుండగా కొండపై వసతి లేకపోవడంతో ఆరుబయటే ఆలయ ఆవరణ తదితర చోట్ల చలిలో బసచేయాల్సిన పరిస్థితి నెలకొంది. వేలాదిగా వచ్చే భక్తుల కోసం కేవలం 47 వరకు మాత్రమే గదులు అందుబాటులో ఉండగా ఇందులో కొన్ని వ్యాపారుల ఆధీనంలో ఉండడంతో భక్తులకు వసతి లేమి తీవ్ర అసౌకర్యంగా మారింది. అంజనాద్రిలో 16, మారుతీ నిలయంలో 14, బుగ్గమఠం, సాగర్, శ్వేత కాటేజీలలో రెండు చొప్పున రూ.100 గదులు 7 ఉండగా వాటినే భక్తులకు ఇస్తున్నారు. కొండగట్టులో గదులు ఉండవనే ప్రచారం వేలాది మంది భక్తులు కొండగట్టుకు నేరుగా వచ్చి దర్శనం చేసుకొని వెలుతున్నారు. గదులు భక్తులకు తగిన రీతిలో ఉంటే వేలాదిగా వచ్చి స్వామి వారి మొక్కులు తీర్చుకునే అవకాశం ఉంది. గదులు లేకపోవడంతో సగం మొక్కుల చెల్లింపునకే పరిమితం అవుతున్నట్లు భక్తులు ఆవేదన చెందుతున్నారు.



కొండపైన గల ధర్మసత్రాలు



గదులు లేక బటయ పడుకున్న అంజన్న భక్తులు

● అధికారుల దృష్టికి తీసుకెళ్లాం - చంద్రశేఖర్, ఈవో

గదుల సంఖ్య తక్కువగా ఉండడంతో భక్తులకు అసౌకర్యం ఏర్పడుతోంది. 500గదుల నిర్మాణం కోసం ప్రయత్నిస్తున్నాం. గదుల లేమి విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దాతలు కూడా గదుల నిర్మాణాలకు విరాళాలు అందించవచ్చు. భక్తులకు ఎలాంటి ఇక్కట్లు కలుగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ పర్యవేక్షిస్తున్నాం. భక్తులకు సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, జూన్ 18: కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకున్నారు. అంజన్న దర్శనం భక్తులు అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో చంద్రశేఖర్, అధికారులు పర్యవేక్షించారు.

● అంజన్నను దర్శించుకున్న పోలీస్ అధికారులు

కొండగట్టు ఆంజనేయస్వామిని మంగళవారం కరీంనగర్ ఇంటిలిజెన్స్ ఎస్పీ రాజమహేంద్ర నాయక్, జగిత్యాల అడిషనల్ ఎస్పీ వినోద్ వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈవో చంద్రశేఖర్‌తో పాటు పోలీస్ అవుట్‌పోస్ట్ ఏఎస్సై చిలుక శ్రీనివాస్ ఉన్నారు

● నేడు బండి సంజయ్ రాక

కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పదవీ బాధ్యతలు చేపట్టాక బుధవారం మొదటి సారి కొండగట్టుకు వస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తన గెలుపు కోసం అంజన్న సన్నిధిలో ముడుపు కట్టగా స్వామి వారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుంటారని బీజేపీ నాయకులు తెలిపారు.

లారీ లోంచి జారిపడ్డ రాయి.. తప్పిన ప్రమాదం

శంకరపట్నం, జూన్ 18: శంకరపట్నం మండలం మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్ద కరీంనగర్-వరంగల్ రహదారిపై ఓ గ్రానైట్ లారీ నుంచి బండరాయి జారి కింద పడింది. కొత్తగట్టు గ్రానైట్ క్వారీ నుంచి లారీలో గ్రానైట్ బండరాయిని కరీంనగర్ వైపుకు తీసుకెళ్తున్నారు. మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్దకు రాగానే లారీ టైర్లు రోడ్డు కిందకు దిగాయి. నేల కుంగడంతో టైర్లు కొంత భాగం భూమిలోకి వెళ్లాయి. లారీ అటువైపు వంగడంతో బండరాయి జారి కింద పడింది. ఈ బండరాయి రోడ్డు పక్కన ఉన్న షాపు సమీపంలో పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. లారీలో బండరాయి తరలించడానికి జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతోనే జారి కింద పడిందన్నారు. గ్రానైట్ వాహనదారులు కనీస జాగ్రత్తలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొంటున్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



కొత్తగట్టులో లారీలోంచి కింద పడ్డ గ్రానైట్ రాయి



సివిల్స్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూన్18: ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ ,ఎస్టీ,ఈబీసీ అభ్యర్థులు సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 19 నుంచి జూలై3 వరకు వెబ్‌సైట్"www.tgbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తరగతులు జూలై18, 2024 నుంచి 2025, జూలై18 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. మొత్తం 150 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనుండగా, అందులో 100 మందికి గాను జూలై 7న నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. మరో 50 మంది అభ్యర్థులను ఇంతకుముందు యూపీఎస్సీ ద్వారా నిర్వహించిన సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్)లో ఉత్తీర్ణత సాధించిన వారిని నేరుగా తీసుకుంటారని పేర్కొన్నారు. వారు సంబంధిత పత్రాలతో జూలై3లోగా బీసీ స్టడీ సర్కిల్ లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్‌లో దరఖాస్తును సమర్పించాలని సూచించారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు లాడ్జింగ్, భోజన, రవాణా కోసం నెలకు రూ.5వేలు ఇస్తారన్నారు. గ్రంథాలయ సదుపాయం కూడా కల్పించినట్లు తెలిపారు. ఈ ఉచిత శిక్షణ హైదరాబాద్‌లో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో రైతులకు మేలు

● కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న

జమ్మికుంట, జూన్ 18: ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు పెట్టుబడుల కోసం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రైతులకు ఎంతగానో మేలు చేస్తుందని కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె)లో భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడి వారణాసిలో పీఎం కిసాన్ నిధి పథకం కింద 17వ విడుత నిధుల విడుదల ప్రారంభ కార్యక్రమాన్ని ప్రత్యేక్షంగా వీక్షించే విధంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యతిధులుగా కేంద్ర మంత్రి, వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధన సంస్థ జోన్ అధికారి డాక్టర్ షేక్ ఎన్ మీరా, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి సోమన్న మాటాడుతూ పంట పెట్టుబడి సాయం కింద దేశంలోని రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ పథకాన్ని 2019 ఫిబ్రవరిలో ఉత్తర్‌ప్రదేశ్ గోరఖ్‌పూర్‌లో ప్రధాన మంత్రి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా మూడు విడుతల్లో రెండు వేల చొప్పున రూ.6వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. 17వ విడుతలతో భాగంగా తొమ్మిది కోట్ల 26లక్షల మంది రైతుల ఖాతాల్లో ఇరువై వేల కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ పద్ధతుల్లో తోటి రైతులకు సహకరించడానికి పారా-ఎక్స్‌టెన్షన్ వర్కర్లుగా పని చేయడానికి కృషి సఖిలుగా శిక్షణ పొందిన 30వేల మందికి పైగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రధాన మంత్రి మోదీ సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధన సంస్థ జోన్ అధికారి డాక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ ప్రపంచం, దేశంలో అత్యధికంగా 80శాతం చిన్న, సన్నకారు రైతులు ఉన్నారని, వారికి ఆర్థికంగా చేయూతను అందించేందుకు ఈ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. వ్యవసాయంలో అగ్రి డ్రోన్ల మీద 85శాతం సబ్సిడీ ఇస్తున్నారని, అందులో మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ శిక్షణ ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధులను రైతులు పెట్టుబడిగా ఉపయోగించుకోవాలన్నారు. ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ద్వారా తగిన శాస్త్రీయత సాంకేతిక సలహాలు పొందుతూ వ్యవసాయ రంగంలో రాణించాలని కోరారు. కెవికె ప్రధాన కార్యదర్శి పరిపాటి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులను రక్షించేందుకు, వారి కుటుంబాలకు భరోసా కల్పించేందుకు రైతు బీమాను కల్పించాలని కేంద్ర మంత్రిని కోరారు. ప్రస్తుతం వ్యవసాయంలో రైతులు నేల ఆరోగ్యంపై అధికంగా దృష్టి పెట్టాలని, నేల ఆరోగ్యమే మానవ మనుగడకు అవసరమని తెలిపారు. కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద తెలంగాణ రాష్ట్రంలోని 29లక్షల 50వేల మంది రైతులకు రూ.590కోట్ల లబ్ధి చేకూరనుందని తెలిపారు. ఈ ఆర్థిక సహాయం ద్వారా వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకోవడానికి, ఆదాయం పెంచుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేల సత్పతి, హుజూరాబాద్ ఆర్డీవో, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, కెవికె సిబ్బంది, ఆదర్శ రైతులు, వ్యవసాయ, అనుబంధ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి సోమన్న

● కౌశిక్‌రెడ్డి ప్రసంగాన్ని అడ్డుకున్న బీజేపి నాయకులు

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమ ప్రారంభోత్సవ కార్యక్రమాకి హాజరైన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతుండగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన రైతుబంధు, రైతు బీమా, 24గంటల కరెంట్, కాళేశ్వరం ప్రాజెక్ట్, తదితర అంశాల ప్రస్తావన తీసుకువచ్చారు. జరుగుతున్న కార్యక్రమం గురించి మాట్లాడకుండా ఇతర అంశాల మీద మాట్లాడటంపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి ప్రసంగాన్ని అడ్డుకున్నారు. కౌశిక్‌రెడ్డి సైతం వారి తీరుపై అసహనం వ్యక్తం చేశారు. స్వయంగా కేంద్ర మంత్రి స్పందించి బీజేపీ నాయకులకు నచ్చచెప్పే ప్రయత్నం చేయగా, వారు శాంతించడంతో గొడవ సద్దుమనిగింది.

ధర్మపురిలో ఘనంగా మహాలక్ష్మీ నృసింహ మహాయజ్ఞం

ధర్మపురి, జూన్ 18: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అష్టోత్తరశత మహాలక్ష్మీ నృసింహ మహాయజ్ఞం మంగళవారం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీ నరసింహ స్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరంలాగే లోక కల్యాణార్థం, సమస్త విశ్వశాంతి కోసం హైదరాబాద్‌కు చెందిన శ్రీమాన్ భాగవతుల వంశీకృష్ణమాచార్య స్వామి ఆధ్వర్యంలో ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. నరసింహ స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ ఉగ్ర నారసింహ స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. అనేక మంది భక్తులు యజ్ఞంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, సీనియర్ అసిస్టెంట్ అలు వాల శ్రీనివాస్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్ సిబ్బంది ఉన్నారు.



మహాయజ్ఞం నిర్వహిస్తున్న అర్చకులు

మాల్దీవ్స్‌లో నారాయణపూర్ వాసి మృతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 18: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన శీతల చంద్రయ్య మాల్దీవ్స్‌లో ప్రమాదవశాత్తు ఈ నెల 17న మృతి చెందాడని కుటుంబ సభ్యులు, స్థానికులు మంగళవారం పేర్కొన్నారు. ఆయన మరణ వార్త తెలియడంతో కుటుంబంతో పాటు స్వగ్రామంలో విషాదం నెలకొంది. నెల రోజుల కిందట చంద్రయ్య సోదరుడు నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో మాల్దీవ్స్ నుంచి అంత్యక్రియలకు ఆయన స్వస్థలానికి చేరుకున్నాడు. 15 రోజుల పాటు ఇక్కడే ఉన్న చంద్రయ్య తిరిగి పయనమయ్యాడు. నెల రోజుల వ్యవధిలోనే ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా రోధిస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని చంద్రయ్య ఉన్న ఊరిలో ఉపాధి లేక గత 20 ఏళ్లుగా ముంబాయికి వలస వెళ్లాడు. అక్కడ అఫ్గాన్ కంపెనీలో పనులు చేస్తు జీవిస్తుండేవాడు. ఈ క్రమంలో అదే కంపెనీ మాల్దీవ్స్ దేశంలో వంతెన నిర్మాణ పనులను చేపడుతోంది. దాంతో రెండేళ్ల కిందట చంద్రయ్య మాల్దీవ్స్‌కు వెళ్లాడు. నెల రోజుల కిందట అతని సోదరుడు నర్సయ్య అనారోగ్యంతో చనిపోయాడు. స్వగ్రామానికి వచ్చిన చంద్రయ్య అంత్యక్రియలు నిర్వహించి 15 రోజుల పాటు ఉండి తిరిగి పయనమయ్యాడు. ఈ నెల 17న వంతెన పనులు చేస్తున్న క్రమంలో రెండు క్రేన్ల మధ్య చిక్కుకుని చనిపోయాడని కంపెనీ ప్రతినిధులు మృతుడి భార్య పోశవ్వకు సెల్‌ఫోన్ ద్వారా మంగళవారం సమాచారం అందించారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోధిస్తున్నారు. భారత ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేలా చర్యలు తీసుకోవడంతో పాటు తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.



చంద్రయ్య(ఫైల్)

మృతుడికి భార్య పోశవ్వ, వివాహమైన కూతురు భాగ్యలక్ష్మీ ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య కోరారు.

నేరెళ్లలో ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు

ధర్మపురి, జూన్ 18: ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ బోనాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తి మీద బోనాలు పెట్టుకుని డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. అనంతరం మహిళలు, రైతులు ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మహిళలు అమ్మ వారలకు పసుపు, కుంకుమ చల్లి, బోనాలు పెట్టి నైవేద్యం సమర్పించారు. కుటుంబ సభ్యులు క్షేమంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నేరెళ్ల మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు, న్యాయవాది జాజాల రమేష్, మాజీ ఉపసర్పంచ్ జాజాల శంకర్, ఉపాధ్యక్షులు పాదం చంద్రయ్య, జంగిలి తిరుపతి, కరవత్తుల నాగరాజు,జాజాల రవి ఉన్నారు.



గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ బోనాలు

రెయిన్ గన్‌తో పత్తికి నీరు


పత్తి చేనులో రెయిన్ గన్

ఎల్లారెడ్డిపేట, జూన్ 18: వర్షాలు పడక సరైన సమయంలో సాగు నీరందక వరుణుడి కోసం ఆకాశం వైపు అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. దుక్కులు దున్ని పత్తి విత్తనాలు విత్తిన చినుకు పడకపోవడంతో పెట్టుబడులు మీద పడుతాయని ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు మొలకెత్తేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన రైతు దాసరి సత్తయ్య తాను సాగు చేసిన ఎనిమిది ఎకరాల్లో పత్తి విత్తనాలు భూమిలో మాడిపోకుండా కాపాడుకునేందుకు రెయిన్ గన్‌ను ఏర్పాటు చేశారు. సుమారు రూ.20 వేలు వెచ్చించి కొనుగోలు చేసి తడులకు నీరందిస్తున్నారు. గంట సమయంలో పది గుంటల విస్తీర్ణంలోని భూమి తడిసేలా నీరందిస్తూ పంటను రక్షించుకుంటున్నారు. ఒక రోజులో సుమారు మూడు ఎకరాల్లో నీరందిస్తున్నానని రైతు సత్తయ్య పేర్కొన్నాడు. రెయిన్ గన్‌తో పత్తి విత్తనాలు మాడిపోకుండా మొలకలు వచ్చేలా తడులు పెడుతున్నానని చెబుతున్నాడు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

ముస్తాబాద్, జూన్ 18 : కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ భారీ మెజారిటీతో గెలుపొంది, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం ఆయన నివాసంలో ముస్తాబాద్ మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్ ఆధ్వర్యంలో స్థానిక బీజేపీ నాయకులు కలిసి శుభాకంక్షలు తెలిపారు. ప్రధాన కార్యదర్శి సొల్ల క్రాంతి, బాధ నరేశ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు వెంకన్న, రమేశ్‌గౌడ్, రాజు, గణేశ్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను ఢిల్లీలోని ఆయన నివాసంలో వీర్నపల్లి మండల బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా నాయకులు మాలోతు ప్రకాష్ నాయక్, భూక్య రమేష్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలోని పోడు సమస్యలను పరిష్కరించేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఇటీవల బాబాయ్ చెరువు తండా గ్రామానికి చెందిన ప్రేమించి మోసపోయిన యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేసిన విషయాన్ని కేంద్ర సహాయ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు పెట్టిన కేసులను ఉపసంహరించుకునేలా చూడాలని కోరారు.

బోయినపల్లి: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా నియామకమైన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను బోయినపల్లి మండలం బీజేవైఎం అధ్యక్షులు కొనుకటి హరీష్ శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీలో బండి సంజయ్‌ని మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత

ఇల్లంతకుంట, జూన్ 18: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన కీర్తి శ్రీకాంత్ సెల్ ఫోన్ పోగొట్టుకోగా ఎస్సై రాజుగౌడ్ మంగళవారం అప్పగించారు. రెండు నెలల క్రితం రూ.20 వేల విలువైన మొబైల్ ఫోన్ పోయిందని శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ యాప్‌ద్వారా ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందించారు. ఫోన్‌ఎక్కడ ఉందో గుర్తించడానికి కృషి చేసిన పీసీ లక్ష్మీనారాయణను ఎస్సై అభినందించారు.

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట

కోనరావుపేట, జూన్ 18 : కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో మంగళవారం రైతులు వర్షాలు సమృద్ధిగా కురవాలని కప్పతల్లి ఆట ఆడారు. వర్షాకాలం ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా సరైన సమయంలో వర్షాలు పడకపోవడంతో వేసిన విత్తనాలు మొలకెత్తి ఎండిపోయే పరిస్థితి ఏర్పడంతో వరణుడు కరుణించి వర్షాలు కురవాలని మామిడిపల్లి రైతులు కప్పతల్లి ఆట ఆడారు. అనంతరం గ్రామ దేవతలకు క్షీరాభిషేకం చేశారు. జలాభిషేకం చేసిన అనంతరం రాత్రి వర్షం పడడంతో రైతు సంతోషం వ్యక్తం చేశారు.

టీ స్టాల్‌లోకి పాము.. భయంతో పరుగులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 18: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన ఉన్న ఓ టీ స్టాల్‌లోకి మంగళవారం పాము దూరింది. ఒక్కసారిగా టీ తయారు చేసే డబ్బా వద్దకు రావడంతో అక్కడ టీ తయారు చేసే వ్యక్తితో పాటు తాగేందుకు నిలబడిన వ్యక్తులు, యువకులు భయంతో పరుగులు తీశారు. డబ్బాలోని వస్తువులను తొలగించి పాము కోసం కర్రలతో యువకులు వెతికారు. సుమారు 20 నిమిషాల పాటు డబ్బా కిందకు అటు, ఇటు పాకుతూ పాము యువకులను ముప్పుతిప్పలు పెట్టింది. చివరకు చిక్కింది. పామును చంపడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రాజమల్లుకు బంగారు నంది అవార్డు

సిరిసిల్ల టౌన్, జూన్ 18: సిరిసిల్ల పట్టణానికి చెందిన బైరి రాజమల్లుకు మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతి కళా వేదికలో తెలంగాణ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బంగారు నంది అవార్డును అందజేశారు. పట్టణానికి చెందిన శ్రీకాళహస్తీశ్వర మ్యారేజ్ బ్యూరో నిర్వహిస్తున్న రాజమల్లు 2023 -24 సంవత్సరానికి ఐదు వివాహాలు చేయించడంతో జేఏసీ ఆధ్వర్యంలో సన్మానించారు.

నీట్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి

తంగళ్లపల్లి, జూన్18: నీట్ నిర్వహణలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కష్టపడి చదివి పరీక్ష రాసిన లక్షలాది మంది విద్యార్థులకు, తల్లితండ్రులకు భరోసా ఇవ్వాలన్నారు. దేశ వ్యాప్తంగా నీట్‌లో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చాలని, నీట్ అక్రమాల పైన ప్రధాని మోదీ మాట్లాడాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లో నీట్ పత్రాలు అమ్ముకున్న వైనంపై ప్రధాని ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. నీట్ అక్రమాలతో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నీట్ ఎగ్జామ్‌లో 67 మందికి ఫస్ట్ ర్యాంక్ రావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఒకే సెంటర్ నుంచి ఎనిమిది మంది విద్యార్థులు 720 మార్కులు సాధించడం చూస్తే పెపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో అర్థం అవుతోందన్నారు. ఎడ్యుకేషన్ హబ్‌గా ఉన్న తెలంగాణలో కూడా 150 వరకు ఒక్క ర్యాంక్ రాకపోవడం నీట్ అక్రమాలకు అద్దం పడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మట్టే శ్రీనివాస్, నాయకులు నవీన్ ఒగ్గు అరవింద్, రుద్రవేని సుజిత్, కొడం వెంకటేష్, గౌరు రాకేష్, సుర రంజిత్, భాను, నరేష, తిరుపతి తదితరులు ఉన్నారు

ప్రైవేటు పాఠశాల పుస్తకాల అమ్మకాలపై చర్యలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 18: అనుమతి లేకుండా పుస్తకాలను విక్రయిస్తున్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీచైతన్య ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో రఘుపతి మంగళవారం తెలిపారు. పాఠశాలకు సంబంధించిన పుస్తకాలను అమ్ముతున్నారనే ఫిర్యాదుతో తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా విక్రయిస్తున్నారని గుర్తించామని చెప్పారు. సీజ్ చేసి ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

అదనపు హెల్పర్ నియామకం

ఎల్లారెడ్డిపేట, జూన్ 18: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో అదనంగా మరో హెల్పర్‌ను నియమించామని సెస్ ఏఈ పృథ్వీధర్ మంగళవారం పేర్కొన్నారు. గ్రామంలోని 8 వేల విద్యుత్ కనెక్షన్లు ఉండడం, ఒక్కరే హెల్పర్ కావడంతో సమస్యలు తలెత్తితే ఇబ్బందవుతోందని ఇటీవల అధికారులకు విన్నవించారని తెలిపారు. అదనంగా మరో హెల్పర్‌ను నియమించాలని కోరారన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు హెల్పర్ రమేశ్‌ను అదనంగా నియమించామని పేర్కొన్నారు. గ్రామంలో హెల్పర్లు వెంకటేశ్, రమేశ్ విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. హెల్పర్‌ను నియమించడంపై మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్, వినియోగదారులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

పేద కుటుంబానికి బియ్యం అందజేత

సిరిసిల్ల టౌన్, జూన్ 18: సిరిసిల్ల పట్టణం 36వ వార్డు కౌన్సిలర్ కల్లూరి రాజు ఓ పేద కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం 36వ వార్డు సుందరయ్యనగర్‌కు చెందిన సూరంపల్లి మైసమ్మ, భారతమ్మ దంపతుల కూతురు పల్లవి వివాహ కార్యక్రమంలో కౌన్సిలర్ రాజు 50 కిలోల బియ్యంను ఉచితంగా అందించారు. నాయకులు గడ్డం వెంకటేష్, కొక్కుల నర్సయ్య, కోడూరి మల్లేశం, లింగంపల్లి దేవయ్య, గోక లక్ష్మీరాజం, అడిగోప్పుల దేవదాస్, దూస ఎల్లప్ప, గడ్డం శంకర్, గోక సురేష్ పాల్గొన్నారు.

పరిహారం వచ్చేనా?

- కొనసాగుతున్న మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలు - అడ్డుకుంటున్న రైతులు - పట్టించుకోని పాలకులు, అధికారులు


పెద్దూర్ శివారులో మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలు

సిరిసిల్ల రూరల్, జూన్ 18 : సిరిసిల్ల జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలకు సేకరించిన భూములకు గత ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకపోవడం, ప్రస్తుతం నిర్మాణాలను కొనసాగిస్తుండడంతో ఆ భూములను కోల్పోయిన ఆందోళనకు గురవుతున్నారు. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని సర్వేనంబర్ 408లో ఉన్న 50 ఎకరాల ప్రభుత్వ భూములను గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు భూములు లేని నిరుపేద రైతులు 40 మందికి పట్టాలను అందించాయి. దీంతో వారు ఆ భూములపైనే ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల మంజూరు కావడంతో అ సమయంలో అధికారంలో ఉన్న మంత్రి కేటీఆర్ జిల్లా కలెక్టర్‌తో కలిసి ఈ భూముల్లో 36 ఎకరాలను మెడికల్ కళాశాలకు సేకరించారు. తమ భూములను తీసుకోవద్దని బాధిత రైతులు ఆందోళనలు చేశారు. పలుమార్లు కేటీఆర్ వారితో సమావేశాన్ని ఏర్పాటు చేసి తీసుకున్న భూములకు బదులు వాణిజ్య వ్యాపారాలు చేసుకుందుకు ప్రతి ఒక్కరికి 800 గజాలనుంచి 1000 గజాల వరకు స్థలంతోపాటు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇవ్వడంతో నమ్మిన రైతులు మెడికల్ కళాశాల నిర్మాణానికి అనుమతులు ఇస్తూ సంతకాలు చేశారు. గత ప్రభుత్వం ఆఘమేఘాల మీద కళాశాల భవనాన్ని నిర్మించి గత సంవత్సరం మాజీ సీఎం కేసీఆర్ ఆన్‌లైన్‌లో కళాశాలను ప్రారంభించారు. నష్టపరిహారంతోపాటు స్థలాలను ఇవ్వాలంటూ జిల్లా కలెక్టర్‌తోపాటు కేటీఆర్ చుట్టూ తిరిగినా స్పందన లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయితే మిగిలిన భూముల్లో అదనపు భవనాలను నిర్మించకుండా అడ్డుకుంటామని రైతులు నిర్ణయించుకున్నారు. ఫిబ్రవరి 7వ తేదీన కాంట్రాక్టర్ వచ్చి అదనపు భవనాల నిర్మాణాల పనులు ప్రారంభించగా ఈ విషయం తెలుసుకున్న రైతులు అక్కడి చేరుకొని పనులను అడ్డుకున్నారు. అందోళనలు చేయడంతో పనులను నిలిపివేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవోను ఆదేశించడంతో అప్పటి ఆర్డీవో రైతులతో మాట్లాడి మరోచోట స్థలాలను అందిస్తామని చెప్పారు. సర్వేయర్‌తో ఆ భూములకు సర్వే చేయించడంతో నమ్మిన రైతులు పనులను అడ్డుకోకపోవడంతో కాంట్రాక్టర్ నిర్మాణ పనుల్లో వేగం పెంచారు. అంతేకాకుండా ప్రస్తుతం నిర్మిస్తున్న భవనాలతోపాటు మరోచోటా అదనపు భవనాలను నిర్మించేందుకు కాంట్రాక్టర్ గత నెల మే 19వ తేదీన పెద్దూర్ గ్రామానికి చెందిన నాగుల లక్ష్మీకి చెందిన భూముల్లో హద్దులను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి వెళ్లి హద్దుల కోసం వేసిన కర్రలను తొలగించి దగ్ధం చేయడంతోపాటు ఆందోళనలు చేపట్టారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల సందర్భరంగా సిరిసిల్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను బాధిత రైతు లక్ష్మీ తమ భూములను మెడికల్ కళాశాలకు తీసుకున్నారని, నష్టపరిహారం ఇవ్వకుండా మోసం చేశారని నిలదీసిన కూడా ఎలాంటి స్పందన లేకుండా పోయింది. అంతేకాకుండా మెడికల్ కళాశాల భూములపై అవగాహన ఉన్న కలెక్టర్ అనురాగ్ జయంతి బదిలీపై వెళ్లిపోవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చిందని రైతులు ఆందోళనలు చెందుతున్నారు.


నిర్మాణాలను అడ్డుకుంటున్న రైతులు

న్యాయం జరిగే వరకు పోరాటం

- సలేంద్రి బాలరాజుయాదవ్, పెద్దూర్



నిరుపేదలమైన తమ జీవనోపాధికోసం గత ప్రభుత్వాలు ఇచ్చిన భూములను మెడికల్‌కళాశాల కోసం మాజీ మంత్రి కేటీఆర్ హామీ మేరకు ఇచ్చాం. మా భూములకు బదులు వెయ్యిగజాల స్థలంతోపాటు నష్టపరిహారాన్ని అందిస్తామని నమ్మించి సంతకాలు తీసుకొని మోసం చేశారు. మాకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగించడంతోపాటు పనులు జరుగకుండా అడ్డుకుంటాం.

నిర్మాణాలను అడ్డుకుంటాం

- లింగంపల్లి సత్యనారాయణ, 9వ వార్డు కౌన్సిలర్ పెద్దూర్



పెద్దూర్ శివారులో సర్వేనంబర్‌లో ఉన్న మా భూములకు నష్టపరిహారంతోపాటు వెయ్యి గజాల స్థలాన్ని అందిస్తామని చెప్పడంతో ఎ మెడికల్ కళాశాలకు ఇచ్చాం. అందులో భవనాలను నిర్మిస్తున్నా మాకు న్యాయం చేయడంలేదు. న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తాం. నిర్మాణాలను అడ్డుకుంటాం, ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి మాజీ మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం న్యాయం చేయాలి.

జిల్లా కోర్టు మోడల్ భవన సముదాయాన్ని నిర్మించండి


హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి రాధారాణికి రాజన్న ప్రసాదం, చిత్రపటం అందజేస్తున్న న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, జూన్ 18: రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టు మోడల్ భవన సముదాయం నిర్మించాలని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి జస్టిస్ రాధారాణిని సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని హైకోర్టులో ఆమెతోపాటు హైకోర్టు న్యాయమూర్తి, భవన నిర్మాణ కమిటీ సభ్యుడు జస్టిస్ విజయసేనారెడ్డిని, హైకోర్టు న్యాయమూర్తి జె. శ్రీనివాసరావును కలిశారు. రాజన్న ప్రసాదం, చిత్రపటం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల కోర్టు పరిధిలో ఉన్న పాత భవన స్థలంలోనే నూతన మోడల్ భవన సముదాయాన్ని నిర్మిస్తే కక్షిదారులకు, న్యాయవాదులకు అనుకూలంగా ఉంటుందని కోరారు. దూర ప్రాంతంలో నిర్మిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని, ప్రభుత్వం కేటాయించిన స్థలం అనుకూలంగా లేదని న్యాయవాదులు పేర్కొన్నారు. ప్రస్తుతం మున్సిపల్ భవనంలో కొనసాగుతున్న ఏడీఎం కోర్టును జిల్లా కోర్టు భవన సముదాయంలోకి మార్చాలని విజ్ఞప్తిచేశారు. ఇదే విధంగా జిల్లా కోర్టు నుంచి ఉమ్మడి కరీంనగర్‌కు బదిలీ అయ్యే 80 కేసులను నిలిపివేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జోర్నాల సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకటి, జాయింట్ సెక్రెటరీ నాగరాజుగౌడ్, లైబ్రరీ కార్యదర్శి శశాంకం, క్రీడల కార్యదర్శి గుడ్ల కిషన్, సీనియర్ న్యాయవాదులు రవీందర్‌రావు, హరికృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

మైనర్లు వాహనం నడిపితే చర్యలు


వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

రుద్రంగి జూన్18: మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వాహనం ఇచ్చిన వారిపై, తల్లిదండ్రులపై చర్యలుంటాయని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు వారం రోజుల నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే మైనర్లపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోటారు వాహన చట్టం ప్రకారం నంబరు ప్లేట్లు సరిగా లేని వాహనాల్ని గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టమన్నారు. నెంబర్ లేని 50 వాహనాలకు నెంబర్ ప్లేట్లు రాయించినట్లు చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సిరిసిల్ల అశోక్, పోలీసులు పాల్గొన్నారు

హామీలను అమలు చేయాలి

తంగళ్లపల్లి, జూన్ 18: ఎన్నికల్లో భాగంగా వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీల అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం రాళ్లపేట గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఆరు మాసాలు దాటినా వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామన్న వాగ్దానం అమలు కాకపోవడం బాధాకరం అన్నారు. సామాజిక పింఛన్ నెలకు రూ.4వేలు పెంచడం, మహిళలకు నెలకి రూ. 2500 ఆర్థిక సహాయం వంటి హామీలు నేటికీ అమలు కావడం లేదన్నారు. పక్క రాష్టం ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక భద్రత పథకం కింద ఇచ్చే పింఛన్ రూ.4 వేల అమలుకు శ్రీకారం చుట్టారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఉపాధి హామీ కూలీలకు వంద రూపాయలు కూడా రావడం లేదన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలి పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 పెంచినట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా ఆచరణలో అమలు కావడం లేదన్నారు. వ్యవసాయ కార్మికుల ఉపాధి కూలీల సంక్షేమం విస్మరించి వారి పొట్టలు కొట్టిన కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికల్లో గుణపాఠం చెప్పారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి తగినట్టుగా నిధులు కేటాయించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు, జిల్లా నాయకులు పర్శరాములు, శ్రీనివాస్ రెడ్డి, చిరంజీవి, నరసయ్య, సోమ పర్శరాములు, గౌరు శ్రీనివాస్ పాల్గొన్నారు

కార్మికులకు ఉపాధి కల్పించాలి

సిరిసిల్ల రూరల్, జూన్ 18: మరమగ్గాల కార్మికులకు ఉపాధిని కల్పిం చేందుకు కేంద్రం ప్రభుత్వానికి సంబంధించిన వస్త్రాలను సిరిసిల్లలోనే ఉత్పత్తి చేయి ంచేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మెగా పవర్‌లూం క్లస్టర్‌తో పాటు ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, యారన్‌పై ఉన్న జీఎస్టీని రద్దు చేయించాలని, నియోజకవర్గ సమస్యలను పట్టించుకోవాలని అన్నారు.కేంద్ర సహాయ మంత్రిగా బండి సంజయ్ బుధవారం జిల్లాలో పర్యటించనున్న పత్రిక ముఖంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదేళ్ల ఎంపీగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదన్నారు. ఇప్పుడు రెండోసారి గెలిచి కేంద్ర సహాయ మంత్రి అయ్యారని, ఇప్పుడైనా మాటలతో కాలయాపన చేయకుండా సమస్యలపై దృష్టిసారించాలని అన్నారు. ఈఎస్ఐ హాస్పిటల్ శంకుస్థాపనకే పరిమితమైందని, వెంటనే పూర్తి చేయించాలని అన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల్లో సంక్షోభం నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. మెగా పవర్‌లూం క్లస్టర్ సిరిసిల్లలో ఏర్పాటు చేయించాలన్నారు. యారన్‌పై జీఎస్టీ రద్దు చేయించాలని కోరారు. సీపీఎం జిల్లా నాయకులు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, రాజశేఖర్, రమేష్ చంద్ర పాల్గొన్నారు.

వేతనాల కోసం వినతి

గంభీరావుపేట, జూన్ 18 : గంభీరావుపేట పంచాయతీ కార్యదర్శి అశోక్‌కు పారిశుధ్య కార్మికులు వేతనాల కోసం మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఆరు మాసాలుగా తమకు వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. అప్పట్లో వారం రోజుల్లో వేతనాలు అందేలా చూస్తామని అధికారులు మాట ఇచ్చారని, ఇప్పటికీ అందలేదని అన్నారు. వేతనాలు అందాకే విధుల్లోకి వస్తామని స్పష్టం చేశారు.

అక్రమ నిర్మాణాలపై యువత ఆగ్రహం


ఆందోళన చేస్తున్న యువకులు, నాయకులు

ముస్తాబాద్, జూన్ 18 : ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో కొంత కాలంగా జరగుతున్న అక్రమనిర్మాణాలపై అలసత్వం వహిస్తున్న అధికారుల తీరుపై యువత, అఖిల పక్షం నాయకులు మండిపడ్డారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ ఎదుట అఖిల పక్షం నాయకులు బైఠాయించారు. కొంత కాలంగా ముస్తాబాద్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలకు అధికారులే అండగా నిలుస్తున్నారని మండిపడ్డారు. ప్రధాన రహదారికి ఇరుపక్కల అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ముడుపుల విషయంలో డీపీవోకు రాతపూర్వకంగా సాక్ష్యాలతో ఫిర్యాదు చేస్తే స్పందన లేదని ఆరోపించారు. మురుగు నీటి కాలువలు శుభ్రం చేయడం లేదని, డ్రైనేజీపై సీసీ వేయకపోవడంతో ఇబ్బందులు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. గల్లీల్లో పాత గోడలు కూల్చకుండా రోడ్లపైనే మెట్లు, ర్యాంప్‌లు, రేకుల షెడ్డులు ఏర్పాటు చేస్తున్నా గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అయ్యప్ప ఆలయం వద్ద మూడెళ్ల క్రితం సీసీ రోడ్డు వేసేందుకు గ్రామ పంచాయతీయే తీర్మానం చేయగా అది ప్రైవేటు స్థలంలోకి వెళ్లిందంటూ ఈవో రాజు సీసీ రోడ్డు మధ్యలో ఖనీలు పెట్టించారని ఆరోపించారు. ప్లాటు యజమానికి తెలియకుండా సీసీ వేస్తే దానిని నష్టం ఎవరు భరించాలన్నారు. అక్రమనిర్మాణాలను తొలగించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ పెంజర్ల బాలెల్లం, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మెంగని మహేందర్, అఖిల పక్షం నాయకులు దీటి నర్సింలు, రంజాని నరేశ్, శీల ప్రశాంత్, కంచం నర్సింలు, దుబ్బాక రాజు, సారుగు రాకేశ్, అరుట్ల తిరుపతిరెడ్డి, తాళ్ల విజయ్‌రెడ్డి, శ్యాగ మహేశ్, మీస శంకర్, మీరుదొడ్డి భాను, ఏదునూరి భాను తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

ముస్తాబాద్, జూన్ 18 : స్వర్ణకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ముస్తాబాద్ మండల స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు చింతోజు బాలయ్య అన్నారు. ముస్తాబాద్ మండలంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నుంచి మండలంలోని స్వర్ణకారులంతా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా చింతోజు బాలయ్య మాట్లాడుతూ కార్పొరేట్ దుకాణాలతో స్వర్ణకారుల జీవితాలు అంధకారమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వర్ణకారులకు రూ.5 వేల పింఛన్ అందించాలని, ఇల్లులేని స్వర్ణకారులకు డబల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేయాలని అన్నారు. ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. స్థానిక బస్టాండ్ వద్ద తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సబ్సిడీపై ఆభరణాల తయారీకి కావాల్సిన ముడిసరుకులు, ఆధునిక యంత్రాలను స్వర్ణకారులకు అందించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం నాయకులు తుమ్మన పెల్లి సతీశ్, చింతోజు శ్రీనివాస్, నారోజు రాజు, వెంగళం శ్రీనివాస్, బ్రహ్మచారి, సత్యనారాయణ, అనిల్, చింతోజు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నాగంపేట గ్రామ పంచాయతీ రికార్డుల స్వాధీనం

గంభీరావుపేట, జూన్ 18 : గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామ పంచాయతీ కార్యాలయం రికార్డులను మంగళవారం డీఎల్‌పీవో నరేష్ స్వాధీనం చేసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిధులు, అధికార దుర్వినియోగం వంటి అంశాలపై వచ్చిన ఫిర్యాదులతో డీఎల్‌పీవో నరేష్ విచారణ నిమిత్తం వివరాలు సేకరించారు. గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని ఇటీవల గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో నాగంపేటకు వచ్చినట్లు డీఎల్‌పీవో నరేష్ వెల్లడించారు. గతంలో గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని వచ్చిన ఫిర్యాదుపై విచారణ పూర్తి స్థాయిలో జరగలేదని ఫిర్యాదులో పొందుపర్చారని పేర్కొన్నారు. అదే విధంగా గ్రామ కార్యదర్శి కూడా విధి నిర్వహణలో సమయ పాలన పాటించడం లేదని పేర్కొన్నట్లు చెప్పారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఫైళ్లను స్వాధీనం చేసుకున్నామని, విచారణ నిమిత్తం ప్రజల నుంచి వివరాలను సేకరించామని తెలిపారు. త్వరలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని డీఎల్‌పీవో నరేష్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి డీఎల్‌పీవో నరేష్ వచ్చిన సమయంలో ఈవోపీఆర్‌డీ రాజశేఖర్, ఎంపీటీసీ నాగభూషణం, సెక్రెటరీ శిరీష, నాయకులు తిరుపతిరెడ్డి, రాములు, రాజు, శేఖర్, సత్యం, రాజేందర్ తదితరులు ఉన్నారు.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి

చందుర్తి, జూన్ 18 రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని మండల కాంగ్రెస్ నాయకుడు పులి సత్తయ్య అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని సింగిల్ విండో గోదాంలోని ఎరువుల బస్తాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సహకార సంఘంలో విత్తనాలు, ఎరువులు అందుబాటు లేవనే విషయాన్ని వ్యవసాయ శాఖ ఏడి దృష్టికి తీసుకెళ్లగా ఒక లోడ్ ఎరువుల బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపిందని, సొసైటీకి వెళ్లి చూడగా కేవలం 29 బస్తాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని అన్నారు.

గుడుంబా పట్టివేత

తంగళ్లపల్లి, జూన్18 : తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలోని పది లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. నేరెళ్ల గ్రామంలో సారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు తంగళ్లపల్లి పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా దాడి చేయగా దండు ఎల్లయ్య అనే వ్యక్తి వద్ద పది లీటర్ల గుడుంబా దొరికింది. గుడుంబా అక్రమంగా అమ్ముతున్న దండు ఎల్లయ్య పైన కేసు నమోదు చేసి గుడుంబా సీజ్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఖతార్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

రుద్రంగి, జూన్ 18 : రెండు రోజుల క్రితం ఖతార్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలను తెలంగాణ ఎన్ఆర్ఐల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో రుద్రంగి మండల కేంద్రానికి చెందిన దసారి అరుణ్ కూమార్ అనే సింగర్ పాటలు పాడేందుకు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా గ్రామస్థులు అరుణ్‌ను అభినందించారు. చిన్నతనం నుంచి అరుణ్ కూమార్ అనేక చానల్స్‌లో పాటల పోటీల్లో పాల్గొన్నాడు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

బోయినపల్లి, జూన్18: బోయినపల్లి మండలంలోని గుండన్నపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ఎంఈవో చెన్న మాధవుని రామరాజు పదివేల విలువగల నోటు బుక్స్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీడీవో జయశీల, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్, నాయకులు కొప్పుల స్వామి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఇల్లంతకుంట, జూన్ 18: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో బాధిత కుటుంబాన్ని బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి మంగళవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన శనిగరం చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తిరుపతిరెడ్డి బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు.

ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 18: ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేపట్టి మత్స్యకారులకు అందించి ఉపాధిని కల్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా మత్స్యశాఖ చైర్మన్ చొప్పరి రామచంద్రం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం అందిస్తున్న చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ఈ సంవత్సరం కూడా చేపట్టి మత్స్య శాఖ సొసైటీలకు అందించాలని తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో ఆన్‌లైన్‌లో టెండర్ల నోటిఫికేషన్‌వచ్చి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకొని ఆగస్టు నెలలో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమం మొదలు పెట్టి డిసెంబరు చివరికల్లా జిల్లాలోని అన్నీ చెరువులు, కుంటలు డ్యామ్‌లలో వదలాలని పేర్కొన్నారు. దీనిలో భాగంగానే జిల్లాలోని మూడు రిజర్వాయర్లు, మిడ్ మానేరు, అనంతగిరి, ఎగువ మానేరులతోపాటు 440 చెరువులలో చేపపిల్లలను వదలాల్సి ఉందని, దీనికిగాను కోటి 40 లక్షల చేపపిల్లలను ప్రభుత్వం అందించి మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని కోరారు.